# బ్రిడ్జి బ్యూటిఫుల్

- కంచరపాలెం నేతాజీ వంతెనకు మహర్దశ
- శిథిలావస్థ నుంచి సుందరీకరణ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫ్లైఓవర్ అభివృద్ధి



టైల్స్‌తో అందంగా కనిపిస్తున్న ఫుట్‌పాత్

**కంచరపాలెం:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో కంచరపాలెం నేతాజీ వంతెనకు మహర్దశ పట్టింది. ఈ ఫ్లైఓవర్ బ్రిడ్జిని అభివృద్ధి చేయడంతో పాదచారులు, వాహన చోదకులు సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. కంచరపాలెం మెట్టు కూడలి నుంచి జ్ఞానాపురం రైల్వే స్టేషన్ వరకు గల రహదారుల అభివృద్ధికి జీవీఎంసీ రూ.1.65 కోట్ల నిధులు మంజూరు చేసింది. నేతాజీ వంతెనకు మరమ్మతులు చేపట్టడమే కాకుండా ఈ మార్గంలో బీటీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, పూలకుండీలు ఏర్పాటు చేసి, బ్రిడ్జి గోడలకు ఆకర్షణీయ రంగులు వేసి చక్కగా తీర్చిదిద్దారు. పాదచారులు నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్‌లపై టైల్స్, జీబ్రా క్రాసింగ్ రంగులు వేశారు. ఆహ్లాదకర వాతావరణం కంటికి కనిపించేలా వంతెనను బ్యూటిఫుల్‌గా ఆధునికీకరించారు.



సుందరంగా కంచరపాలెం నేతాజీ వంతెన

**నాడు కళావిహీనం..**
గత ప్రభుత్వంలో నేతాజీ వంతెన కళావిహీనంగా ఉండేది. దీని పరిస్థితిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కంచరపాలెం ప్రధాన కూడలి నుంచి జ్ఞానాపురం రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గాల్లో విద్యుత్ లైట్లు వెలగక చిమ్మచీకట్లు కమ్ముకునేవి. వంతెనపై విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి నేలకొరిగాయి. ఫుట్‌పాత్‌లపై పాదచారుల రాకపోకలకు ఇబ్బందికరంగా పడి ఉండేవి. రాత్రి వేళ చీకట్లలో వాహన చోదకులు ఇబ్బందులు పడేవారు. సాయంత్రం అయ్యేసరికి వంతెన మార్గం అంధకారంతో నిండి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారేది. ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళా వాకర్స్ ఇబ్బందులు పడేవారు.

కళతప్పిన నేతాజీ వంతెన

**నేడు సుందరీకరణ..:** వైఎస్సార్‌సీపీ ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు కె.కె.రాజు, ఆడారి ఆనంద్‌కుమార్, దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌ల కృషితో నేతాజీ వంతెన అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. జీవీఎంసీ జోన్–5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌లు నిర్మించి సిమెంట్ పలకలు, టైల్స్ వేశారు. తుప్పుపట్టిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. వాటికి లైట్లు అమర్చడంతో వంతెనపై వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఫ్లైఓవర్‌పై కొత్త హంగులు, ప్లాంటేషన్ పనులు పూర్తి చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. కంచరపాలెం నేతాజీ వంతెనను అభివృద్ధి చేయడంతో స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**నేతాజీ వంతెన సుందరీకరణకు చేపట్టిన పనులు.. వినియోగించిన నిధుల వివరాలు**

| పనులు | నిధులు |
|---|---|
| సీసీ రోడ్లు | రూ.11.50 లక్షలు |
| బీటీ రోడ్లు | రూ.45.82 లక్షలు |
| వంతెన జాయింట్‌కు గ్రౌటింగ్ | రూ.12.32 లక్షలు |
| ఫుట్‌పాత్‌పై సిమెంట్ పలకలు | రూ.08.21 లక్షలు |
| ఫుట్‌పాత్‌లకు టైల్స్ | రూ.23.45 లక్షలు |
| విద్యుత్ స్తంభాలు, లైట్లు | రూ.12.67 లక్షలు |
| ఫుట్‌పాత్‌లకు రంగులు | రూ.18.50 లక్షలు |
| వంతెన రక్షణ గోడలకు రంగులు | రూ.22.98 లక్షలు |
| వంతెనపై ప్లాంటేషన్ | రూ.10.20 లక్షలు |



వంతెనపై విరిగిన ఫుట్‌పాత్


కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్‌పై ప్లాంటేషన్

## పచ్చదనంతో వంతెన



గతంలో కంచరపాలెం నేతాజీ వంతెనపై నడవాలంటేనే ఇబ్బందికరంగా, రాత్రి వేళ భయంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధితో వంతెన సమస్యలకు మోక్షం లభించింది. వంతెనను పచ్చదనంతో నింపారు. వాహన చోదకులు, పాదచారులు సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారు.

– గిడుతూరి రాణి, జ్ఞానాపురం

## సాఫీగా రాకపోకలు



కొత్త రోడ్లు, ఫుట్‌పాత్‌లు, విద్యుత్ లైట్లు, రంగులతో నేతాజీ ఫ్లైఓవర్ కళకళలాడుతోంది. వాహన చోదకులు సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెనను అభివృద్ధి చేశారు.

– పాత్రపిల్లి సునీల్‌కుమార్, కంచరపాలెం

## క్లుప్తంగా

### ఆత్మీయ సమావేశం


కె.కె.రాజును సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు, రేసపువానిపాలెం నాయకులు

**సీతమ్మధార:** జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలేనికి చెందిన పార్టీ శ్రేణులు, స్థానికులు ఉత్తర పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును కలిసి సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న యువకులు

**సీతంపేట:** వాసవీ వాల్తేర్ కపుల్స్ ఆధ్వర్యంలో శంకరమఠం రోడ్డులోని వీ డెంటల్ హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథి వాసవీ క్లబ్ కేబినెట్ సెక్రటరీ బి.ఎస్.వి.కమలశ్రీ శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 100 మందికి పైగా యువకులు, మహిళలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అమ్మ బ్లడ్ బ్యాంకు సిబ్బంది దాతల నుంచి రక్తం సేకరించారు. దాతలకు క్లబ్ ప్రెసిడెంట్ పి.వినోద్‌కుమార్, ట్రెజరర్ కె.రామకృష్ణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ కె.వి.గురుమూర్తి, జి.అనిల్‌కుమార్, వీ డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, క్లబ్ ప్రతినిధులు పి.రమేష్, పి.స్వాతి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు వై.శ్వేత, ఇ.శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

### పోలీస్ బైక్ ప్రారంభం


బైక్‌ను పరిశీలిస్తున్న సీఐ విజయకుమార్

**సీతమ్మధార:** ఎన్నికల నేపథ్యంలో నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు 30 ద్విచక్ర వాహనాలు(బైక్) పంపించారు. ఈ మేరకు ఆదివారం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బైక్‌ను సీఐ ఎస్.విజయకుమార్ ప్రారంభించారు. స్టేషన్ పరిధిలోని సమాచారం కోసం, ఎలాంటి అల్లర్లు జరగకుండా చర్యలు చేపట్టేందుకు ఒక కానిస్టేబుల్ ఈ వాహనం ద్వారా పర్యవేక్షిస్తుంటారు. ట్రాఫిక్‌లో వెళ్తున్నప్పుడు కీప్ లెఫ్ట్ అని ఈ బైక్ డిజిటల్ బోర్డుపై స్క్రోలింగ్ అవుతుంది. స్టేషన్ పరిధిలో ఎటువంటి ప్రమాదాలు జరిగినా వెంటనే ప్రథమ చికిత్స జరిగేలా ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేశారు.

### పరిపూర్ణ ఆనందంతో జీవించాలి


మాట్లాడుతున్న బెహన్ మోహిని ఆహూజా

**సీతమ్మధార:** ప్రతి ఒక్కరూ పరిపూర్ణ ఆనందంతో జీవించాలని బెహన్ మోహిని ఆహూజా అన్నారు. మన కళ్లతో ప్రపంచంలో ఉన్న అన్నింటినీ చూడగలమని, నిరాకార పరమాత్మను మాత్రం దర్శించలేమని, సద్గురువు ప్రసాదించే జ్ఞాననేత్రం ద్వారానే నిరాకార ఈశ్వరుడిని చూడగలమని పేర్కొన్నారు. గురుద్వారా దరి కావేరి కల్యాణ మండపంలో సద్గురుమాతా సుదీక్ష జీ మహరాజ్ ఆశీర్వాదంతో భక్తులందరికీ ఆశీస్సులు ఇచ్చి మంచి మాటలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనువు, మనసు, ధనంతో పరిపూర్ణ ఆనందం పొందాలన్నారు. భక్తులందరినీ కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాకేష్‌పాల్, రాజీవ్‌ర్, ప్రేమ్ మీర్ పూరీ తదితరులు పాల్గొన్నారు.

# కొండవాలు ప్రజలకు అండగా ఉంటా..

- వైఎస్సార్‌సీపీ ‘ఉత్తర’ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- 48వ వార్డులో పర్యటన


ఆత్మీయ సమావేశంలో పార్టీ శ్రేణులతో కె.కె.రాజు, చొక్కాకుల వెంకటరావు


కొండవాలు ప్రాంత నివాసుల సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు

**కంచరపాలెం:** సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి కొండవాలు ప్రాంతాన్ని దత్తత తీసుకోవడంతోపాటు కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టి ప్రజలకు అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు హామీ ఇచ్చారు. జీవీఎంసీ 48వ వార్డు ఏఎస్సార్ నగర్ సామాజిక భవనంలో పార్టీ వార్డు శ్రేణులతో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మురికివాడలు అభివృద్ధి చెందడంతోపాటు కొండవాలు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. రానున్న ఎన్నికల్లో విజయ కేతనం ఎగురవేసి రెట్టింపు ఉత్సాహంతో ప్రజా సంక్షేమాన్ని కొనసాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ వార్డుల వారీగా కార్యకర్తలను సమన్వయపరుస్తూ కె.కె.రాజు గెలుపునకు నాయకులంతా కృషి చేయాలని కోరారు. అనంతరం వార్డులోని పలు ప్రాంతాల్లో కె.కె.రాజు పర్యటించి ప్రజల సమస్యలను ఆత్మీయ పలకరింపుతో తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శంకరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ నీలి రవి, పార్టీ సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, అప్పారావు, మహిళా నాయకురాలు పద్మావతి, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, గ్రామపెద్దలు, గృహసారథులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చి గెలిపించండి


రైల్వే న్యూకాలనీ మసీదు వద్ద ముస్లిం పెద్దలు, నాయకులతో బొత్స ఝాన్సీ, కె.కె.రాజు, ఆళ్ల లీలావతి

- ఇఫ్తార్ విందులో ముస్లింలతో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బొత్స ఝాన్సీ, కె.కె.రాజు

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ మసీదు వీధిలో ఆదివారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజులు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనవాస్‌తో కలిసి పాల్గొన్నారు. రంజాన్ ఉపవాస దీక్ష ఉపసంహరణ సందర్భంగా సాయంత్రం ముస్లింల కోసం పలు రకాల వంటకాలతో ఇఫ్తార్‌ను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ, కె.కె.రాజులు మాట్లాడుతూ ఈ పవిత్ర మాసంలో ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ముస్లింలందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చి, ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకోవాలని వీరు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహమాన్, ఎన్నికల పరిశీలకులు బాణాల శ్రీనివాసరావు, ఐ.హెచ్.ఫరూఖీ, కార్పొరేటర్లు బర్కత్ ఆలీ, కె.వి.ఎన్.శశికళ, కె.అనిల్‌కుమార్ రాజు, కో ఆప్షన్ సభ్యులు షరీఫ్, ఆళ్ల శివగణేష్, కేవీ బాబా, బిలాల్, కప్పర్, అహ్మద్, లంకా భాస్కర్, బులుసు జగదీష్, కె.పి.రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాసరావు, హబీబ్, షేక్ బాబ్జీ, రియాజ్, జఫ్రుల్లా, బొడ్డేటి గంగామహేష్, సంతోష్, 42వ వార్డు పార్టీ నాయకులు, మహిళలు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి వ్యవస్థలే ముఖ్యం



మాట్లాడుతున్న ఆచార్య ప్రసన్నకుమార్, చర్చా కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

**సీతంపేట:** ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి వ్యవస్థలు సక్రమంగా పనిచేయాలని సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ అన్నారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, విశాఖ పబ్లిక్ లైబ్రరీ సంయుక్తంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయశంకర్ రచించిన గ్రంథం 'వై భారత్ మేటర్స్'పై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తులు మారినా సంస్థలు శాశ్వతంగా నిలిచి ఉంటాయన్నారు. న్యాయవాది ఎం.రామదాస్ మాట్లాడుతూ జయశంకర్ రచించిన పుస్తకంలోని ముఖ్య అంశాలను సమీక్షించారు. భారతదేశం ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా ఎదగడానికి తగిన వనరులున్నాయని, వ్యవస్థల మధ్య సమన్వయంతో పాలన సాగాలన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ నెహ్రూ, ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, నరేంద్రమోదీ విధానాలను వివరించారు. మోదీ రాముడిని ఒక గొప్ప నాయకుడిగా చూపిస్తున్నారని, భారతీయ సంస్కృతి వైశిష్ట్యాన్ని లోకానికి చాటడానికి ప్రాధాన్యమిస్తున్నారని చెబుతూ, రామాయణంలోని మానవీయ కోణాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, రచయిత డి.వి.సూర్యారావు, వివిధ రంగాల ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు.

## నేడు నూకాంబికకు జలాభిషేకం

**మురళీనగర్:** జీవీఎంసీ 49వ వార్డు బర్మా క్యాంప్ జైభారత్‌నగర్‌లో వెలసిన నూకాంబికా అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు సోమవారం ప్రారంభమవుతాయని ఆలయ ఈవో తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 6 నుంచి 11 గంటల వరకు జలాభిషేకం చేస్తారు. మహిళలు బిందెలతో పవిత్ర జలాలను తీసుకొచ్చి హరిద్ర జలాభిషేకం, అనంతరం పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహిస్తారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

**తాటిచెట్లపాలెం:** అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో 132 కేవీ హెచ్‌టీ టవర్ ఏర్పాటు, కండక్టర్ మార్పుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంజీవయ్య కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

# కె.కె.రాజుకు ‘కళింగ కోమటి’ సంఘం మద్దతు


వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుతో కళింగ కోమటి వైశ్య సంక్షేమ సంఘం నాయకులు

**సీతమ్మధార:** వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు కళింగ కోమటి వైశ్య సంక్షేమ సంఘం మద్దతు తెలిపింది. సీతమ్మధార ప్రియదర్శిని కాలనీలోని సామాజిక భవనంలో ఆదివారం కళింగ వైశ్య ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కె.కె.రాజుకు సంఘ నాయకులు తమ మద్దతు ప్రకటించారు. 14, 24 వార్డుల కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, బోగి ప్రవీణ్‌కుమార్, గోవింద్ రావు, టి.సాయిమోహన్, పాట్నూర్ రామ్మోహన రావు, కోరాడ మోహన్‌రావు, గుడ్ల కృష్ణ, గుడ్ల సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మంచిగా ఉంటామని రౌడీషీటర్లతో ప్రతిజ్ఞ


ద్వారకా స్టేషన్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న సీఐ రమేష్


ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో రౌడీషీటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ విజయకుమార్


ఐదో పట్టణ పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ భాస్కరరావు

**సీతమ్మధార:** ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎటువంటి గొడవల్లో తలదూర్చమని, కుటుంబాలతో కలిసి సుఖసంతోషాలతో ఉంటామని, గతంలో తెలియక చేసిన తప్పులను పునరావృతం కాకుండా చూసుకుంటామని, మద్యం మానేస్తామని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటామని రౌడీషీటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టామని, నగరంలో ఎటువంటి అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

**రౌడీషీటర్లపై పోలీస్ నిఘా**
ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సమాజంలో అల్లర్లు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎటువంటి నేరాలు చేయకుండా మంచిగా నడుచుకోవాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని, మద్యం షాపుల వద్ద గొడవలు చేస్తే ఊరుకోమని సీఐ హెచ్చరించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇంటి వద్ద పోలీసులు అప్పగించారు. ఎస్ఐ ధర్మేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

**సత్ప్రవర్తనతో మెలగండి**
**మర్రిపాలెం:** కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎటువంటి అల్లర్లు సృష్టించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేయకూడదన్నారు. ఎల్లప్పుడూ పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా మెలగాలన్నారు. ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మట్టల ఆదివారం

**కంచరపాలెం:** జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ ప్రధాన దేవాలయంలో రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ నేతృత్వంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు మట్టలతో జ్ఞానాపురం వీధుల్లో ప్రార్థనలు చేశారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, దివ్యబలి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఫాదర్ జాన్‌ప్రకాష్ మాట్లాడుతూ క్రీస్తు ప్రభువుకు జెరూసలేం పట్టణంలోకి వచ్చే సమయంలో నాటి ప్రజలు మ్రానుకొమ్మలతో స్వాగతం పలికినట్లు చెప్పారు. ఆ సందర్భంగా మట్టల ఆదివారం నిర్వహిస్తారన్నారు. సహాయ విచారణకర్తలు బైబిల్ చదివారు. ఈస్టర్ వరకు ప్రతి ఒక్కరూ రోజూ చర్చిలో జరిగే ప్రార్థనల్లో పాల్గొనాలని కోరారు. పాదర్లు వేళంగిణిరాజు, ప్రభాకర్, పీపీసీ సభ్యులు పాల్గొన్నారు.

## వాకర్స్‌తో కె.కె.రాజు మమేకం


డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో వాకర్స్‌తో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

**తాటిచెట్లపాలెం:** వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు నియోజకవర్గంలోని పలు పార్కుల్లో వాకర్స్‌తో మమేకమవుతున్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆదివారం ఉదయం కైలాసపురం దరి డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో వాకర్స్‌తో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి యువత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిక్కు వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఆనంద్ సింగ్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, పైడి రమణ, పార్టీ శ్రేణులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.